క్లుప్తంగా

నేడు, రేపు గడప గడపకు మన ప్రభుత్వం

చేజర్ల: మండలంలోని పాతపాడు సచివాలయం పరిధిలో ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి శుక్ర, శని వారాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ తూమాటి విజయభాస్కర్‌రెడ్డి గురువారం తెలిపారు. ప్రజాప్రతినిధులు,అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరై జయప్రదం చేయాలని కోరారు.

విద్యార్థులకు గ్లాసుల పంపిణీ



కలిగిరి: స్థానిక ఆదర్శ పాఠశాలలోని విద్యార్థులకు జగనన్న గోరుముద్దకు సంబంధించి స్టీలు గ్లాసులను గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ దేవనబోయిన వెంకట సుబ్బయ్య మాట్లాడుతూ ప్రభుత్వం జగనన్న గోరుముద్దలో భాగంగా అందజేస్తున్న రాగి జావ కోసం 418 మంది విద్యార్థులకు నాణ్యమైన స్టీలు గ్లాసులు పంపిణీ చేయడం సంతోషకరమన్నారు. ప్రిన్సిపల్ అన్నవరపు శ్రీనివాసులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో తనిఖీలు



సంగం: స్థానిక గ్రంథాలయాన్ని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కుమార్‌రాజా గురువారం ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. గ్రంథాలయ భవనం, పుస్తకాలను పరిశీలించి రికార్డులను తనిఖీ చేశారు. జిల్లాలో సెస్ బకాయిలు వసూలు కాకపోవడంతో గ్రంథాలయాలను అభివృద్ధి చేయలేకపోతున్నామన్నారు. కలెక్టర్ దృష్టికి సమస్యను తీసుకెళ్లి గ్రంథాలయాలను అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపడుతామన్నారు. ఆయన వెంట లైబ్రేరియన్ రవీంద్రారెడ్డి ఉన్నారు.

గడ్డివాముల దగ్ధం



కలిగిరి: పరికోటలో ప్రమాదవశాత్తు మూడు గడ్డివాములు గురువారం దగ్ధమయ్యాయి. వివరాలు..రైతులు కోటంరెడ్డి లక్ష్మిరెడ్డి, శేషిరెడ్డి, మాల్యాద్రిరెడ్డి పశువుల కోసం వరి గడ్డిని కొనుగోలు చేసి గ్రామ సమీపంలోని దొడ్లలో వాములుగా వేసుకున్నారు. గడ్డివాములపై వెళ్తున్న విద్యుత్ తీగలు గాలులకు రాసుకుని నిప్పురవ్వలు ఎగిసి పడడంతో గడ్డివాములకు మంటలు అంటుకున్నాయి. వింజమూరు అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. సుమారు రూ.1.20 లక్షల మేర నష్టం వాటిల్లినట్లు బాధితులు తెలిపారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు



కలిగిరి: గ్రామసచివాలయ ఉద్యోగులు విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఎంపీడీఓ ఆర్‌వీ కళాధర్‌రావు హెచ్చరించారు. లక్ష్మీపురం గ్రామసచివాలయాన్ని గురువారం ఆయన సందర్శించి రికార్డులను తనిఖీ చేశారు. సచివాలయ సిబ్బందికి సూచనలు చేశారు. స్పందన, జగనన్నకు చెబుదాం అర్జీలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. అంగన్‌వాడీ కార్యకర్తలతో సమావేశమై జనన ధ్రువీకరణ, ఆధార్ కార్డులు లేని 5 ఏళ్లలోపు పిల్లలకు గుర్తించి వెంటనే అందజేయాలని సూచించారు.

శ్మశాన వాటికలో జంగిల్ క్లియరెన్స్



సంగం: స్థానిక పెన్నా బ్యారేజ్ వద్ద ఉన్న హిందూ శ్మశాన వాటికలోని కంపచెట్లను గురువారం తొలగించి లెవలింగ్ చేపట్టారు. శ్మశాన వాటికలో కంపచెట్లు దట్టంగా పెరగడంతో అంత్యక్రియలు, దహన సంస్కారాలు చేసుకునేందుకు హిందువులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు కాకు మధుసూదన్ యాదవ్ శ్మశాన సమస్యను జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో విన్నవించడంతో ఎంపీడీఓ గోపి స్పందించారు. హిందూ శ్మశాన వాటికను వెంటనే అభివృద్ధి చేయాలని పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్‌ను ఆదేశించారు. ఈ మేరకు ప్రొక్లయినర్ సాయంతో శ్మశానవాటికలోని కంపచెట్లను తొలగించి లెవలింగ్ చేపట్టారు.

విద్యతోనే ఉన్నత శిఖరాలు

- ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి



నగదు ప్రోత్సాహకాలు అందుకున్న విద్యార్థులతో ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

ఆత్మకూరురూరల్: విద్యతో ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని, ప్రభుత్వ విద్యా పథకాలను సద్వినియోగం చేసుకుని విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించాలని ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆత్మకూరు నియోజకవర్గ స్థాయిలో జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఆత్మకూరు మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని నమ్మి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేద పిల్లల కోసం జగనన్న విద్యాకానుక, అమ్మఒడి, ఫీజురీయింబర్స్‌మెంట్, తదితర సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. నాడు–నేడు ద్వారా పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులను కల్పిస్తున్నారన్నారు. పేద విద్యార్థుల భవిష్యత్తు కోసం సంక్షేమ పథకాలను అమలు చేస్తుండగా, ప్రతిపక్షాలు వృథాగా నిధులు ఖర్చు చేస్తున్నారని విమర్శలు చేయడం సరికాదన్నారు. పేదరికంతో తమ బిడ్డలను బడికి బదులు పనికి పంపుతున్న తల్లిదండ్రుల బాధలను తీరుస్తూ జగనన్న అమలు చేస్తున్న విద్యా పథకాల విలువను చిన్నారులకు ఉపాధ్యాయులు తెలియజెప్పి ప్రోత్సహించాలన్నారు.

త్వరలో స్టార్టప్ ఆత్మకూరు

నియోజకవర్గంలో బహుముఖ అభివృద్ధి సాధించేందుకు త్వరలో స్టార్టప్ ఆత్మకూరు అనే బృహత్తర కార్యక్రమం చేపట్టనున్నామని ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి పేర్కొన్నారు. ఎంజీఆర్ ఫౌండేషన్ సహకారంతో పాఠశాల, కళాశాల, మండల స్థాయిల్లో అత్యధిక మార్కులు సాధించే ముగ్గురు ప్రతిభావంతులకు స్కాలర్‌షిప్‌లు అందజేస్తామన్నారు. నియోజకవర్గంలోని 250 ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ తరగతులు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. నిరుద్యోగులకు నైపుణ్య శిక్షణా తరగతులు నిర్వహించి ప్రతి మూడు నెలలకు ఒకసారి జాబ్ మేళా ఏర్పాటు చేసే ఉద్యోగావకాశాలు కల్పిస్తామని వివరించారు.

విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు

పదోతరగతి, ఇంటర్మీడియట్‌లో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి ప్రశంసాపత్రాలు, నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. ఆత్మకూరు మండలం కరటంపాడు జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థిని మునగచర్ల స్నేహలత(586), చేజర్ల మండలం నాగలవెలటూరు జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థిని ఇనుకుర్తి మహిమాచౌదరి (584), సంగం మండలం అన్నారెడ్డిపాళెం జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థి బొమ్మలాట కోటిభార్గవ్ (583)కు ప్రశంసాపత్రాలు, నగదు ప్రోత్సాహకాలను అందజేశారు. అలాగే మర్రిపాడు ప్రభుత్వ కళాశాలకు చెందిన సీఈసీ విద్యార్థిని కన్నెమరకల వాణి (840), ఎంపీసీ విద్యార్థిని ఓరుగంటి నందిని (975), నందవరం ఆదర్శ పాఠశాలకు చెందిన బైపీసీ విద్యార్థిని ముప్పాళ్ల స్వాతి (973), ఆత్మకూరు కళాశాలకు చెందిన హెచ్‌ఈటీ విద్యార్థిని ఇరుపోతు తానియా (849), తదితరులకు ప్రభుత్వ ప్రశంసాపత్రాలు, నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. అలాగే ఆత్మకూరు మున్సిపల్ వైస్‌చైర్మన్ కేవీ శ్రావణ్‌కుమార్‌రెడ్డి తన సొంత నిధులతో నగదు ప్రోత్సాహకాలను ఎమ్మెల్యే చేతుల మీదుగా విద్యార్థులకు అందజేశారు. ఆత్మకూరు ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ గోపారపు వెంకటరమణమ్మ, వైస్‌చైర్మన్ షేక్ సర్దార్, ఎంపీడీఓ ఐజాక్ ప్రవీణ్, ఎంఈఓ నజీర్, ఎమ్మార్పీ చంద్రశేఖర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు అల్లారెడ్డి ఆనంద్‌రెడ్డి, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు కొండా వెంకటేశ్వర్లు, చేజర్ల జెడ్పీటీసీ పీర్ల పార్థసారథి, వైఎస్సార్‌సీపీ నాయకులు నోటి వినయ్‌కుమార్‌రెడ్డి, జమీర్, బొమ్మిరెడ్డి రవికుమార్‌రెడ్డి, షేక్ పర్వీన్, బొమ్మిరెడ్డి రవికుమార్‌రెడ్డి, ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లు హనుమంతరాజు, పేట శ్రీనివాసులురెడ్డి, వాసుబాబు, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

23న మున్సిపల్ బస్టాండ్ ప్రారంభోత్సవం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

ఆత్మకూరు: ఆత్మకూరు డెవలప్‌మెంట్ ఫోరం ఆధ్వర్యంలో రూ.4.52 కోట్ల వ్యయంతో నిర్మించిన మున్సిపల్ బస్టాండ్‌ను ఈ నెల 23న అట్టహాసంగా ప్రారంభించనున్నట్లు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆయన తన కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రయాణికుల సౌకర్యార్థం తన సొంత నిధులతో బస్టాండ్‌ను నిర్మించినట్లు తెలిపారు. బస్టాండ్ ప్రారంభోత్సవానికి పలువురు రాష్ట్ర మంత్రులు హాజరుకానున్నారని చెప్పారు. నారంపేట ఎంఎస్ఎంఈ పార్కులో ఓ పరిశ్రమ ఏర్పాటుకు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నామని, త్వరలోనే సఫలీకృతం కానున్నట్లు తెలిపారు. బస్టాండ్ ప్రారంభోత్సవ ఏర్పాట్లకు ప్రత్యేకంగా కమిటీలను ఏర్పాటు చేస్తున్నామని, అందరూ కలిసికట్టుగా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. పార్టీ పట్టణాధ్యక్షుడు అల్లారెడ్డి ఆనంద్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ గోపారం వెంకటరమణమ్మ, వైస్‌చైర్మన్లు డాక్టర్ కేవీ శ్రావణ్‌కుమార్, షేక్ సర్దార్, ఆత్మకూరు, ఏఎస్‌పేట ఎంపీపీలు కేతా వేణుగోపాల్‌రెడ్డి, బోయిళ్ల పద్మజారెడ్డి, జెడ్పీటీసీ పీర్ల పార్థసారథి, నాయకులు బాలిరెడ్డి సుధాకర్‌రెడ్డి, రఘునాథరెడ్డి, జీ శ్రీనివాసులు నాయుడు, ఐవీ రమణారెడ్డి, నాగులపాటి ప్రతాప్‌రెడ్డి, షేక్ పర్వీన్, కొండా వెంకటేశ్వర్లు, నోటి వినయ్‌కుమార్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలకు అనుగుణంగా ఎరువులు వాడాలి



మట్టి నమూనాల సేకరణను పరిశీలిస్తున్న జేడీఏ సుధాకర్‌రాజు

దుత్తలూరు: రైతులు భూసార పరీక్షల ఫలితాలకు అనుగుణంగా అధికారుల సిఫార్సు మేరకు ఎరువులను వాడుకోవడం ద్వారా సాగుఖర్చులను తగ్గించుకోవచ్చని జేడీఏ సుధాకర్‌రాజు తెలిపారు. మండలంలోని సోమలరేగడలో భూసార పరీక్షల కోసం మట్టి నమూనాలను గురువారం సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు వర్షాలు ఆరంభమవక ముందే మట్టి నమూనాలు సేకరించుకుని పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. భూసార పరీక్షలతో ప్రధాన పోషకాలైన నత్రజని, భాస్వరం, పొటాష్‌తో పాటు సూక్ష్మపోషకాలైన జింకు, ఇనుము, బోరాన్, కాల్షియం లభ్యతను తెలుసుకోవచ్చని తెలిపారు. అనంతరం దుత్తలూరు బిట్–1 సచివాలయాన్ని సందర్శించి రికార్డులను తనిఖీ చేశారు. జిల్లా వ్యవసాయాధికారి కార్యాలయ ఏడీఏ నర్సోజీరావు, ఇన్‌చార్జి ఏడీఏ చెన్నారెడ్డి, ఏఓ సుబ్బారెడ్డి, ఏఈఓ సుధీర్, వీఏఏలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆటాపాటలతో విద్య



అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ రాజేశ్వరి

అల్లూరు: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ఆటాపాటలతో కూడిన విద్యను అందిస్తున్నట్లు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజేశ్వరి తెలిపారు. స్థానిక ఆర్టీఆర్ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో జన్‌భాగీదారి కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 3 నుంచి 6 ఏళ్లలోపు చిన్నారులకు అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారంతో పాటు ఆటాపాటలతో విద్యను అందిస్తారన్నారు. తద్వారా చిన్నారుల శారీరక, మానసిక ఎదుగుదల బాగుంటుందని తెలిపారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, సచివాయల మహిళా పోలీసులు పాల్గొన్నారు.

క్రైస్తవ ప్రార్థనా మందిరానికి రూ.20వేలు విరాళం



ఆత్మకూరు: పట్టణంలోని సోమశిల రోడ్డు సమీపంలో ఉన్న షాలేము ప్రార్థనా మందిరానికి ఎడ్నమ్మ మెమోరియల్ క్రిస్టియన్ ఫౌండేషన్ నిర్వాహకులు పీ శిరీష, ఎడ్వర్డ్ గురువారం రూ.20వేలు నగదు విరాళం అందజేశారు. ప్రార్థనా మందిరం మరమ్మతుల కోసం పాస్టర్ దేవసహాయానికి నగదు చెక్కును అందజేశారు.

పౌష్టికాహారం పంపిణీ

బిట్రగుంట: బోగోలు మండలం ముంగమూరు కూడలిలోని హెచ్ఐవీ పాజిటివ్ బాధితుల ఆదరణ కేంద్రంలో రామిశెట్టి వెంకట సుబ్బారావు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం పండ్లు, పౌష్టికాహారం పంపిణీ చేశారు. ట్రస్ట్ వ్యవస్థాపకుడు రామిశెట్టి వెంకట సుబ్బారావు జన్మదినం సందర్భంగా ట్రస్ట్ ప్రతినిధి మెతుకు రాజేశ్వరి, ఇతర సభ్యులు ఆదరణ కేంద్రంలో కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. అనంతరం కేంద్రంలో ఆశ్రయం పొందుతున్న బాధితులకు పండ్లు, పౌష్టికాహారం, భోజనం ప్యాకెట్లు పంపిణీ చేశారు.

వైభవంగా సీతారాముల కల్యాణం

సీతారామపురం: మండలంలోని దేవమ్మచెరువులో సీతారాముల ఉత్సవాల్లో భాగంగా గురువారం కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. సీతారాముల ఉత్సవమూర్తులను విశేషంగా కల్యాణం నిర్వహించారు. అనంతరం గ్రామోత్సవం నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు.

విద్యార్థినికి అభినందనలు

బిట్రగుంట: బోగోలు మండలం కప్పరాళ్లతిప్ప ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థిని గున్న భవ్య 789 మార్కులు సాధించి కావలి నియోజకవర్గ స్థాయిలో జగనన్న ఆణిముత్యం నగదు ప్రోత్సాహకానికి ఎంపికైనట్లు ప్రిన్సిపల్ వై విజయలక్ష్మి గురువారం తెలిపారు. ఈ సందర్భంగా భవ్యకు కళాశాల అధ్యాపకులు అభినందనలు తెలిపారు.

తూమాటిపై సస్పెన్షన్ ఎత్తివేత

ఆత్మకూరు: టీడీపీ నాయకుడు తూమాటి శశిధర్‌రెడ్డిపై విధించిన సస్పెన్షన్‌ను ఆ పార్టీ అధిష్టానం ఎత్తివేసింది. గతేడాది జరిగిన ఆత్మకూరు శాసనసభ ఉపఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి మేకపాటి విక్రమ్‌రెడ్డిపై తూమాటి టీడీపీ అధిష్టానాన్ని ధిక్కరించి పోటీ చేయడంతో సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. గతేడాది జూన్ 11న సస్పెన్షన్ విధించగా, ఏడాది తరువాత ఎత్తివేస్తూ ఆ పార్టీ రాష్ట్రాధ్యక్షుడు కింజారపు అచ్చెన్నాయుడు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారని ఆ పార్టీ వర్గాలు తెలిపాయి.

నేటి నుంచి మానసాదేవి బ్రహ్మోత్సవాలు

వరికుంటపాడు: తూర్పురొంపిదొడ్లలో కొలువైన మానసాదేవి ఉత్సవాలు శుక్రవారం నుంచి మూడ్రోజుల పాటు నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ తిరుపతయ్య గురువారం తెలిపారు. ఉత్సవాలకు పెద్దసంఖ్యలో భక్తులు తరలిరానున్న నేపథ్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు.

పెన్షనర్లు ఈకేవైసీ చేయించుకోవాలి

అల్లూరు: మండలంలోని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్లు తప్పనిసరిగా ఈకేవైసీని చేయించుకోవాలని కోవూరు ఉపఖజానా కార్యాలయం ఎస్టీఓ కిరణ్ కుమార్ సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఈకేవైసీ స్పెషల్ క్యాంపు నిర్వహించారు. పెన్షనర్లకు ఈకేవైసీ చేశారు. పెన్షనర్ల సంఘ అధ్యక్షుడు పీ భాస్కర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు కృష్ణమూర్తి, కార్యదర్శి నరసయ్య, సంయుక్త కార్యదర్శి శ్రీనివాసులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలపై అవగాహన



ఆత్మకూరురూరల్: మండలంలోని వాశిలి జగనన్న కాలనీ లేఅవుట్‌లో గృహ లబ్ధిదారులకు గృహ నిర్మాణాలపై గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ ఐజాక్ ప్రవీణ్ మాట్లాడుతూ గృహ లబ్ధిదారులకు ప్రభుత్వం అందజేసే నగదుతో పాటు పొదుపు సంఘాల ద్వారా ఆర్థిక సహకారం అందిస్తామని తెలిపారు. గృహ లబ్ధిదారులు సద్వినియోగం చేసుకుని గృహాలను పూర్తి చేసుకోవాలని కోరారు. 14 మంది లబ్ధిదారులు కాంట్రాక్టర్ ద్వారా ఇళ్లు నిర్మించుకునేందుకు ముందుకు రాగా వారికి అవసరమైన సహకారం అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సర్పంచ్ చెలికం రమాహరిబాబు, గృహ నిర్మాణ శాఖ అధికారులు ఉదయ్‌భాస్కర్, శరత్, తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

సీతారామపురం: మారంరెడ్డిపల్లి, చిన్నాగంపల్లి, పబ్బులేటిపల్లిలో ఖాళీగా ఉన్న వలంటీర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంపీడీఓ రంగసుబ్బరాయుడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన వారు ఈ నెల 17లోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. 19న ఇంటర్వ్యూలు ఉంటాయని తెలిపారు.

భూ సమస్యల పరిష్కారమే లక్ష్యం

జలదంకి: భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ సీహెచ్ పద్మావతి తెలిపారు. బ్రాహ్మణక్రాక, బీకేఅగ్రహారం సచివాలయాల్లో రెవెన్యూ సదస్సులను గురువారం నిర్వహించారు. బ్రాహ్మణక్రాకలో 12, బీకే అగ్రహారంలో 8 అర్జీలు అందినట్లు తహసీల్దార్ తెలిపారు. త్వరలో అర్జీలను పరిష్కరిస్తామన్నారు. డీటీ భరత్, వీఆర్వోలు బాలకోటయ్య, శివప్రసాద్, రైతులు పాల్గొన్నారు.

మోటార్‌సైకిల్ అపహరణ

సీతారామపురం: ఇంటి ముందు నిలిపి ఉంచిన మోటార్‌సైకిల్‌ను గుర్తుతెలియని వ్యక్తులు అపహరించుకెళ్లిన ఘటన సీతారామపురంలో గురువారం వేకువన చోటు చేసుకుంది. మెయిన్‌బజార్‌కు చెందిన ఎస్ రవీంద్రకుమార్ రోజూలాగే బుధవారం రాత్రి తన ఇంటి ముందు మోటార్‌సైకిల్‌ను నిలిపి ఉంచాడు. గురువారం ఉదయం లేచిచూడగా మోటార్‌సైకిల్ కనిపించలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

వైద్య రంగానికి ప్రభుత్వం పెద్దపీట



స్క్రీనింగ్ పరీక్షలకు పేర్లు నమోదు చేస్తున్న వైద్యారోగ్య సిబ్బంది

వింజమూరు(ఉదయగిరి): రాష్ట్రంలో వైద్య రంగానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేస్తున్నారని రాష్ట్ర మైనార్టీ కమిషన్ వైస్‌చైర్మన్ జాషువా డానియేల్ పేర్కొన్నారు. వింజమూరు సామాజిక ఆరోగ్య కేంద్రంలో గ్రేస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షల ప్రత్యేక శిబిరాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ వైద్యశాలల్లో అన్ని రకాల మౌలిక వసతులు కల్పించడంతో పాటు పూర్తిస్థాయిలో వైద్య సిబ్బందిని భర్తీ చేస్తున్నారని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కేన్సర్ పరీక్షలు నిర్వహించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. గ్రేస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జిల్లాలోనే తొలిసారిగా వింజమూరులో కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ నెల 16న నెల్లూరు ప్రభుత్వ వైద్యశాల, 17న కావలి ఏరియా వైద్యశాలలో కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించనున్నట్లు చెప్పారు. అనంతరం 236 మంది మహిళలకు కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. డిప్యూటీ డీఎంహెచ్ఓ పీ విజేత, వింజమూరు పీహెచ్‌సీ వైద్యులు శ్వేతాబిర్లా, మృదుల, సుజన, ప్రసన్నలక్ష్మి, మురళీకృష్ణ, గీత, వినీత, డ్వామా ఏపీడీ నిర్మలాదేవి, ఎంపీడీఓ సాయి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి



మాట్లాడుతున్న మెప్మా పీడీ రవీంద్ర

కావలి: జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలపై మెప్మా రిసోర్స్‌పర్సన్లు ప్రత్యేక దృష్టి సారించి లబ్ధిదారులను చైతన్యవంతం చేసి త్వరితగతిన నిర్మించుకునేలా చూడాలని మెప్మా పీడీ డీ రవీంద్ర సూచించారు. కావలి రైల్వేరోడ్డులోని మెప్మా కార్యాలయంలో ఏపీ టిడ్కో, జగనన్న గృహ నిర్మాణాలపై మెప్మా రిసోర్స్‌పర్సన్లతో గురువారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ లక్ష్యం మేరకు నిర్మాణాలను పూర్తి చేసేందుకు సమన్వయంతో పని చేయాలని సూచించారు. ప్రభుత్వం ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.1.80 లక్షలు మంజూరు చేస్తోందన్నారు. మరో రూ.35వేలను మెప్మా ద్వారా పావలా వడ్డీకే రుణంగా అందజేస్తున్నామని తెలిపారు. లబ్ధిదారులకు అవగాహన కల్పించి కాంట్రాక్టర్ల సహకారంతో నిర్మాణాలు పూర్తిచేసుకునేలా చూడాలన్నారు. ఏపీటిడ్కో డీసీఓ రామసుబ్బయ్య, సీఎంఎం భారతి, సీఓలు కొండయ్య, అరుణ కుమారి, ఝాన్సీలక్ష్మి, సునీత, తదితరులు పాల్గొన్నారు.

ప్రతిపక్షాలకు ప్రజలే బుద్ధి చెబుతారు



విలేకరులతో మాట్లాడుతున్న ఎంపీపీ

ఆత్మకూరు: పేదల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఎదుర్కోలేక ప్రతిపక్ష పార్టీలన్నీ ఏకమై కుయుక్తులు పన్నుతున్నాయని, వాటికి రాష్ట్ర ప్రజలు తగిన బుద్ధి చెబుతారని ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జయంతి, వర్ధంతికి కూడా తేడా తెలియని లోకేష్ యువగళం పేరుతో చేపడుతున్న పాదయాత్రకు ప్రజల స్పందన కరువైందన్నారు. సీఎం వైఎస్ జగన్‌ను ఎదుర్కోలేక ప్రతిపక్ష పార్టీలు ఒక్కటవ్వడాన్ని ప్రజలు గమనిస్తున్నారన్నారు. జగనన్న విద్యా వ్యవస్థలో సమూల మార్పులు తీసుకొచ్చారన్నారు. నాడు–నేడు కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దారన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లోని సీట్లకు డిమాండ్ ఏర్పడడమే అందుకు నిదర్శనమన్నారు. జగనన్న ఆణిముత్యాల పేరుతో విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేస్తూ ప్రోత్సహిస్తున్నారన్నారు. విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకొస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రాష్ట్ర ప్రజలు అండగా నిలబడి రానున్న ఎన్నికల్లో గెలిపించాలని కోరారు. నాయకులు బొమ్మిరెడ్డి రవికుమార్ రెడ్డి, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

ఓవర్‌లోడ్ సమస్యకు పరిష్కారం



నూతనంగా ఏర్పాటు చేసిన సింగిల్‌ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్

దుత్తలూరు: దుత్తలూరులోని ఓ వీధిలో గత నాలుగైదు నెలలుగా విద్యుత్ ఓవర్‌లోడు సమస్య నెలకొని తరచూ ఫ్యూజ్‌లు ఎగిరిపోతూ స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. స్థానికులు పలుమార్లు విద్యుత్ శాఖ సిబ్బందికి విన్నవించినా సమస్య పరిష్కారానికి నోచుకోలేదు. దీంతో స్థానికులు జగనన్నకు చెబుదాం టోల్‌ఫ్రీ నంబర్ 1902కు బుధవారం కాల్ చేసి సమస్యను విన్నవించారు. గురువారం ఉన్నతాధికారుల ఆదేశాలతో స్థానిక అధికారులు అదనంగా మరో సింగిల్‌ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసి సమస్యకు పరిష్కారం చూపారు. సమస్యకు వెంటనే పరిష్కారం చూపిన సీఎం వైఎస్ జగన్‌కు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

పురిటి పిల్లలకు ప్రత్యేక వైద్య సేవలు



ఎస్ఎన్‌సీయూ యూనిట్‌లో చిన్నారులకు చికిత్స అందిస్తున్న డాక్టర్ రోషిణి

ఆత్మకూరు: ఆత్మకూరు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో ఎస్ఎన్‌సీయూలో పురిటి పిల్లలకు ప్రత్యేకంగా వైద్యసేవలను అందిస్తున్నట్లు డాక్టర్ రోషిణి గురువారం తెలిపారు. దివంగత మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి కృషితో ఇటీవల జిల్లా ఆస్పత్రిలో ఎస్ఎన్‌సీయూ విభాగాన్ని ఏర్పాటు చేశారని చెప్పారు. అందులో మొత్తం 15 పడకలను ఏర్పాటు చేయగా, కామెర్ల చికిత్స కోసం ప్రత్యేకంగా ఐదు పడకలను కేటాయించినట్లు తెలిపారు. ఆత్మకూరు ఆస్పత్రితో పాటు ఇతర ప్రాంతాల్లోని ఆస్పత్రుల్లో డెలివరీ అయిన పురిటి పిల్లలకు ఎలాంటి అనారోగ్య సమస్యలు తలెత్తినా ఉచితంగా వైద్యసేవలు అందిస్తున్నామని వివరించారు. ప్రైవేట్ ఆస్పత్రుల్లో పురిటి పిల్లలకు సంక్రమించే వ్యాధుల తీవ్రతను బట్టి రోజుకు రూ.3,500 నుంచి రూ.8వేల వరకు చికిత్స కోసం వసూలు చేస్తారని తెలిపారు. అలాంటి సేవలను ఆత్మకూరు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో ఉచితంగా అందిస్తున్నామని వివరించారు. ప్రస్తుతం నెలకు 70 నుంచి 80 కేసులను పరిశీలిస్తున్నామని తెలిపారు. ఆత్మకూరుకు పరిసర ప్రాంతాల ప్రజలు పురిటి పిల్లల సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అచ్చమాంబ పేరంటాలు ఉత్సవాలకు అంకురార్పణ

ఆత్మకూరురూరల్(మర్రిపాడు): మర్రిపాడు మండలం పొంగూరుమాలిచేలో కొలువైన అచ్చమాంబ పేరంటాలు ఉత్సవాలకు గురువారం సాయంత్రం అంకురార్పణ చేశారు. పొంగూరుకు చెందిన ఉభయకర్తలు సంప్రదాయబద్ధంగా గంగపెట్టెను అచ్చమాంబ ఆలయానికి తీసుకురావడంతో ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. 18వ తేదీ వరకు ఆలయం వద్ద విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించనున్నట్లు వంశపారంపర్య ధర్మకర్తలు తెలిపారు. 19న మర్రిపాడు మండలం భీమవరం, 20న పొంగూరు, 21న అనంతసాగరం మండలం అమానిచిరివెళ్ల, 22న మర్రిపాడు మండలం కేతిగుంట గ్రామాల్లో అచ్చమాంబ, వెంగమనాయుడుల గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు చెప్పారు. 23న అచ్చమాంబ ఆలయంలో కల్యాణోత్సవం, 24న రాత్రి ఆలయం వద్ద ప్రత్యేక పూజా కార్యక్రమాలు, 25న సాయంత్రం పొంగళ్లు, బండ్లు తిరుగుట, ఎడ్ల పందేలు, విజేతలకు బహుమతుల ప్రదానం, తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వివరించారు. ఎడ్ల పందేల విజేతలకు కేతిగుంట మాజీ సర్పంచ్ మందాడి శ్రీనివాసులు నాయుడు ప్రథమ బహుమతి రూ.25,016, పొంగూరు సర్పంచ్ అన్నపురెడ్డి రమణమ్మ, రామిరెడ్డి దంపతులు ద్వితీయ బహుమతి రూ.20,116, గంగపాళేనికి చెందిన తంగేడిపల్లి శ్రీనివాసులు తృతీయ బహుమతి రూ.15,016 అందజేస్తారని తెలిపారు.

ఉపాధి పనుల తనిఖీ



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న డ్వామా పీడీ వెంకట్రావు

ఆత్మకూరురూరల్: మండలంలోని బోయలచిరివెళ్లలో ఉపాధి హామీ పథకం కింద చేపడుతున్న చెరువు పూడికతీత పనులను డ్వామా పీడీ వెంకట్రావు గురువారం తనిఖీ చేశారు. దినసరి వేతనంపై కూలీలను ఆరాతీయగా రూ.260 చొప్పున గిట్టుబాటవుతుందని తెలిపారు. స్పందించిన పీడీ మాట్లాడుతూ సకాలంలో పనులకు వచ్చి కొలతల ప్రకారం పనిచేస్తే రూ.272 చొప్పున గిట్టుబాటు అవుతుందని చెప్పారు. కూలీలు వడదెబ్బ బారిన పడకుండా ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. కూలీలకు నీడ సౌకర్యం కల్పించాలని క్షేత్ర సహాయకులకు సూచించారు. ఆయన వెంట ఆత్మకూరు ఏపీడీ శంకర్‌నారాయణ, ఏపీఓ శిరీష, సర్పంచ్ బొలిగర్ల వెంకటేశ్వర్లు, తదితరులు ఉన్నారు.